దరఖాస్తులు పరిశీలించాలి

- పారదర్శకంగా 'రాజీవ్ యువ వికాసం' లబ్ధిదారుల ఎంపిక
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, హాజరైన అధికారులు

వనపర్తి: రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరించడమే కాకుండా.. వారికి అవగాహన కూడా కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎంపీడీఓలతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. దరఖాస్తు గడువును ప్రభుత్వం ఏప్రిల్ 14వ తేదీ వరకు పొడిగించినందున అర్హులు నేరుగా ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలకు వచ్చి దరఖాస్తు చేసుకునేలా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచాలన్నారు. మండల కమిటీల ద్వారా దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేసి వారు పథకానికి అర్హులా.. కాదా.. నిర్ధారించి జిల్లా కమిటీకి పంపాల్సి ఉంటుందన్నారు.

రాయితీ వివరాలు..

పథకానికి ఎంపికైన వారికి రూ.50 వేల లోపు యూనిట్ పెట్టుకునే వంద శాతం సబ్సిడీ ఉంటుందని, రూ. 50 వేల నుంచి రూ. లక్ష లోపు యూనిట్ పెట్టుకుంటే వారికి 90 శాతం సబ్సిడీ, 10 శాతం బ్యాంకు రుణం లభిస్తుందని, రూ.లక్ష నుంచి రూ. 2లక్షల లోపు యూనిట్ పెట్టుకునే వారికి 80 శాతం సబ్సిడీ, 20 శాతం రుణం, రూ. 2లక్షల నుంచి రూ.4 లక్షల లోపు యూనిట్ పెట్టుకునే వారికి 70 శాతం సబ్సిడీ 30 శాతం బ్యాంకు రుణం లభిస్తుందని తెలియజేయాలన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయేతర యూనిట్ పెట్టుకోవాలనుకునే వారికి 21 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు అర్హులని, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ యూనిట్లు పెట్టుకునే వారు 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి మండల స్థాయిలో పరిశీలించి ఏప్రిల్ 20వ తేదీ లోపు జిల్లాస్థాయి కమిటీకి పంపాలని సూచించారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు అవగాహన

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మంజూరు పత్రాలు పొంది, ఇంకా ప్రారంభించని లబ్ధిదారులు మార్కింగ్ వేసుకొని పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదివరకే మార్కింగ్ పూర్తయిన వాటిని పునాది పూర్తి చేసుకునే విధంగా ఎంపీడీఓలు ప్రోత్సహించి, పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఇల్లు కట్టుకునే వారికి ఇసుకకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత మండల తహసీల్దారుతో సమన్వయం చేసుకొని ఇసుక ఇప్పించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ ఉమాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్జలుద్దీన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, జిల్లా పంచాయతీ అధికారి సురేష్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకొచ్చిన వాహనం

- బాలికకు తీవ్ర గాయాలు


డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న పోలీసులు


బొలెరో ఢీకొట్టడంతో కూలిన ఇల్లు

అమరచింత: తాగిన మైకంలో బొలెరో వాహనం నడుపుతూ అతివేగంగా వచ్చి ఇంటిని ఢీకొట్టడంతో ఇంట్లోని గృహోపకరణాలతో పాటు బాలికకు తీవ్రగాయాలయిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన వాసా విజయ్ శివాజీనగర్‌లో ఓ ఇంటికి ఇనుప కడ్డీలు తీసుకెళ్లడానికి ఇదే గ్రామానికి చెందిన శంకర్‌కు చెందిన బొలెరోను తీసుకుని కిరాయికి వెళ్లాడు. డ్రైవర్‌తో పాటు మరికొందరు వాహనంలోనే మందు తాగుతూ శివాజీనగర్‌లో బుక్కమలాంగ్ అనే వ్యక్తికి చెందిన ఇంట్లోకి దూసుకెళ్లగా.. ఇంటి తలుపులతో పాటు గోడలు కూలిపోయాయి. పెల్లలు మీద పడడంతో ఇంట్లో ఉన్న బుక్కమలాంగ్ తమ్ముడి కుమార్తె నౌరిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ విజయ్‌తో పాటు బొలెరో ఉన్న వారు అక్కడి నుంచి తప్పించుకుని వెళ్తుండగా.. కాలనీ వాసులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. రక్తగాయాలతో ఉన్న నౌరిన్‌ను 108లో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ జమీరుద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డ్రైవర్ విజయ్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాములోరి రథోత్సవం



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద మంగళవారం అర్ధరాత్రి భక్తులు రథోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు రథాన్ని కోదండ రామస్వామి ఆలయం నుంచి సమీపంలోని దిగదీర్వతి వరకు లాగి, తిరిగి యథాస్థానికి తీసుకొచ్చారు.

అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయొద్దు



మదనాపురం: రైతులను ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. బుధవారం కొత్తపల్లి, మదనాపురంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూకాల్లో మోసం లేకుండా చూడాలని, తేమ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



పాన్‌గల్: బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా నిరోధం, మాదక ద్రవ్యాల నిషేధం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. బుధవారం మండలంలోని అన్నారం తండాలో ఉపాధి కూలీలకు బాలల హక్కులు–రక్షణ చట్టాలు, బాలల సంక్షేమ సమితి ద్వారా అందిస్తున్న సర్వీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112, 100 అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులను పరిరక్షించేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కంటి పరీక్షలు



ఆత్మకూర్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే వైద్యుల ఆధ్వర్యంలో కంటి, వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం ఆరేళ్ల లోపు చిన్నారులకు కంటి, మానసిక సమస్యలు గుర్తించేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నిస్సార్‌అహ్మద్, డాక్టర్ శంసూనీసా పరీక్షలు నిర్వహించి, కావాల్సిన మందులను అందించారు. చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు రఘునందన్, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన కిల్లె పర్వతాలు కుటుంబానికి గ్రామ శివశంకర్ హమాలీ సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు.

పరామర్శ

మండలంలోని వెంగళాయిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కరాటే గోపాల్ తండ్రి మల్లెపు బక్కన్న అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్ బుధవారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఆంజనేయులు, అంజి, నాయకులు రాజేష్‌రెడ్డి, సుజీవన్, గోపాల్‌రెడ్డి, నరేందర్‌గౌడు, జయరాం, నర్సిహ్మా, దర్గయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనుల్లో వేగం పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీపాద్

ఆత్మకూర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యం తగదని, వేగం పెంచి కూలీలందరికీ న్యాయం చేయాలని ఎంపీడీఓ శ్రీపాద్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై పంచాయతీ కార్యాదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. రైతుల పొలాల్లో భూమి చదును చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాట్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నర్సరీల ఏర్పాటు, ఉపాధి కూలీలకు టెంట్లు, తాగునీరు, కూలీలపెంపు, పనుల పురోగతి, తదితర విషయాలపై చర్చించారు. నిర్దేశించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, టెక్నికల్ పీఓ రఘు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఫ్యాన్ల వితరణ

వీపనగండ్ల: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి పాన్‌గల్‌కు చెందిన దేవాదాయ శాఖ ఉద్యోగి వంగూరు విశ్వేశ్వర్‌రెడ్డి, ఎల్ఐసీ ఏజెంట్ పల్ల నరేందర్‌రెడ్డి రెండు ఫ్యాన్లు వితరణగా అందజేశారు. వీరికి యువకులు, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బీఆర్ఎస్ పార్టీ మండల సమావేశం

పాన్‌గల్: బీఆర్ఎస్ పార్టీ మండల సమావేశం గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభకు జన సమీకరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డీలర్లు సమయపాలన పాటించాలి


పెద్దమందడి రేషన్ షాపులో బియ్యం తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సరస్వతి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలోని రేషన్ షాపు 2, 18వ రేషన్ షాపులను బుధవారం తహసీల్దార్ సరస్వతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గత నెలలో దొడ్డుబియ్యం స్టాక్ వివరాలను అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో డీలర్లు అలసత్వం చేయొద్దన్నారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించి లబ్ధిదారులకు సన్న బియ్యం అందజేయాలని ఆదేశించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తప్పనిసరిగా రేషన్‌షాపు తెరిచి ఉంచాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ గణేష్, సిబ్బంది ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో బుధవారం సన్నబియ్యాన్ని గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు చిట్టెమ్మ, డీలర్ చంద్రకళ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, తండావాసులు పాల్గొన్నారు.

అందరూ సామాజిక చైతన్యం కలిగి ఉండాలి



గోపాల్‌పేట బస్టాండు వద్ద ఎస్ఐ సమక్షంలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గోపాల్‌పేట: ప్రతి ఒక్కరూ సామాజిక చైతన్యం కలిగి ఉండి తప్పుదోవ పట్టకుండా జీవించాలని వనపర్తి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అన్నారు. బుధవారం వారు మండల కేంద్రంలోని బస్టాండు నుంచి రైతువేదిక వరకు సామాజిక చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు మత్తుకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం బస్టాండు నుంచి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేస్తున్న ర్యాలీని పాలమూరు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ పరిశీలించారు. విద్యార్థులు వారం రోజులుగా ఎక్కడెక్కడ ఏమేం కార్యక్రమాలు చేశారని ఎన్ఎస్ఎస్ వలంటీర్ పోతురాజు శ్రీనివాస్‌ను అడిగి వివరాలు సేకరించారు. గురువారంతో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల క్యాంపు పూర్తవుతుందని కోఆర్డినేటర్ చెప్పారు. అంతకముందు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయ పరిధిలో పరిసరాలు శుభ్రం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

వనపర్తి రూరల్: మండలంలోని చందాపూర్‌లో బుధవారం వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యూనిట్ 3, 4 ఆధ్వర్యంలో మూడో రోజు గ్రామంలోని ఎస్సీ కాలనీ, గ్రామ పంచాయతీ ఇరువైపులా, గాంధీ చౌరస్తాలో శ్రమదానం చేసినట్లు ఎన్ఎస్ఎస్ పోగ్రాం అధికారి ధామ్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశామన్నారు. ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్ల వాడకం తగ్గించాలని, ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సహాయ ప్రోగాం కోఆర్డినేటర్ వెంకటస్వామి, కార్యదర్శి రాజేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


వనపర్తిలో..

రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీదే విజయం


మాట్లాడుతున్న పురుషోత్తంరెడ్డి

పెబ్బేరు రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీయే విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మెంటిపల్లి పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరు మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పెబ్బేరు మున్సిపాలిటీని బీజేపీ కైవసం చేసుకుంటుందని, పార్లమెంట్ ఎన్నికల్లో పెబ్బేరు ప్రజలు బీజేపీకి భారీ మెజార్టీ ఇచ్చారని తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత నెలకొందన్నారు. దేశంలో అవినీతి రహిత సుపరిపరిపాలన అందిస్తున్న బీజేపీకి దేశవ్యాప్తంగా మద్దతు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిలింగ్ సభ్యులు వేమారెడ్డి, క్రాంతి నాయుడు, ఆంజనేయులు, రంగస్వామి గౌడ్, రామకృష్ణ, సర్వేశ్వరరావు, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం



వనపర్తిటౌన్: 1971లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఏర్పాటు చేసిన ఎన్ఎస్‌యూఐ నేడు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా మారి, విద్యార్థి సమస్యలపై పోరాడుతుందని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాబర్ట్, సీపీఐ జిల్లా నాయకుడు మోష డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించి, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందజేశారు. దీంతో పాటు రైతులందరికీ రైతు భరోసా, గిట్టుబాటు ధర, బోనస్ ఇవ్వాలని కోరారు. పశువులకు దాణ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటన్న, లింగన్న, కురుమూర్తి, భీమన్న, కొండన్న, రైతులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకం బాధ్యత


పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొన్న ఏసీడీపీ ఝాన్సీలక్ష్మి

వీపనగండ్ల: పసిపిల్లల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించినప్పుడే వారు ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందగలుగుతారని ఏసీడీపీఓ ఝాన్సీ లక్ష్మి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోషణ పక్షం అమలు తీరు అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపడంలో మహిళలది గురుతరమైన బాధ్యత అని, వారిని చైతన్యపర్చడంలో అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు ఎంతో విలువైనవన్నారు. గ్రామాల్లోని పసిపిల్లలు మహిళల్లో పోషణ విలువలు పెంపొందించాలన్న లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ బాలీశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెబ్బేరు రూరల్: మున్సిపాలిటీలోని 10వ వార్డుకు చెందిన బత్తుల బుచ్చన్న అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.60 వేలు మంజూరయ్యాయి. చెక్కును బుధవారం కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, ఎల్లస్వామి, కురుమూర్తి బాధితుడికి అందజేశారు.

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ, జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్ లబ్ధిదారులకు అందజేశారు. కల్వరాలకు చెందిన స్వాతిరెడ్డికి రూ.60 వేలు, సంగినేనిపల్లికి చెందిన నర్సింహకు రూ.22 వేలు, తెలుగు శంకరయ్యకు రూ.12 వేలు, అల్వాల రామలక్ష్మమ్మకు రూ.11 వేల చెక్కులను అందజేశారు. సంగినేనిపల్లిలో ప్రభుత్వం అందజేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్‌రెడ్డి, చెన్నారెడ్డి, ధనుంజయుడు, మీసాల మోహన్, రామచంద్రయ్యగౌడ్, చింతదయాకర్, మండ్లరాముడు, ఆంజనేయులు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నారంతండాలో..

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండాకు చెందిన ముడావత్ గణేష్‌నాయక్‌కు మంజూరైన రూ.43 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం తండా కాంగ్రెస్ నాయకులు రేక్యానాయక్, ప్రేమ్‌నాయక్ బాధితుడికి అందజేశారు. చెక్కు మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, కృషి చేసిన కాంగ్రెస్ మండల నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతినాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'పేదలపై భారం మోపడం సరికాదు'


వనపర్తి అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న మహిళలు



అమరచింతలో..

సాక్షి, నెట్‌వర్క్: అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన క్రూడాయిల్ ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు వంటగ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా నాయకులు సిలిండర్లను రోడ్లపై ఉంచి నిరసన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు పడుతున్న పేదలపై గ్యాస్ బండ వేశారని వాపోయారు.

- కొత్తకోట పట్టణంలోని ఎస్సీ కాలనీలో సీపీఎం మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ.50లు పెంచడం దారుణమని వాపోయారు.
- పాన్‌గల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జబ్బార్, మండల కార్యదర్శి బాల్యానాయక్, సభ్యులు వెంకటయ్య, భగత్, రాము, భాస్కర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.
- అమరచింతలోని బస్టాండు రహదారిలో ఖాళీ సిలిండర్లతో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి, వెంకటేష్, అజయ్, విష్ణు, శ్యాంసుందర్, బుచ్చన్న పాల్గొన్నారు.
- వనపర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భారత ప్రజా తంత్ర మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి గద్వాల సాయిలీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కవిత, శ్యామల పాల్గొన్నారు.
- వీపనగండ్ల మండల కేంద్రంలో సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి, నిరంజన్, ఆశన్న, వెంకటేశ్వర్లగౌడ్, నవీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ఏకమవుదాం.. రెవెన్యూ డివిజన్ సాధిద్దాం'


మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది తిప్పారెడ్డి

ఆత్మకూర్: సంస్థానంగా, తాలుకా కేంద్రంగా కొనసాగిన ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా సాధించుకునేందుకు అందరూ ఏకం కావాలని సీనియర్ న్యాయవాదులు వై తిప్పారెడ్డి, నారాయణగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో బార్ అధ్యక్షుడు జీకే రాములు, ఉపాధ్యక్షుడు దివాన్జీ అశోక్‌కుమార్, ప్రధానకార్యదర్శి ముక్తేశ్వర్‌తో కలిసి మాట్లాడారు. అలాగే విరాట్ విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకడు బంగారు భాస్కర్ స్వర్ణకారులతో రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద సమావేశమయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఇది వరకే అసెంబ్లీలో దృష్టికి తీసుకెళ్లగా.. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైతం ఈ విషయమై కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆత్మకూర్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని, ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని, జూరాల ప్రాజెక్టు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, సివిల్ కోర్టుతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజా, కులసంఘాల నాయకులు, వర్తక, వ్యాపారులు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

ఫిల్టర్ ఇసుక డంపు సీజ్


మామిడిమాడలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద నిల్వ చేసిన ఫిల్టర్ ఇసుకను పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడలో అక్రమంగా నిల్వ చేసిన ఫిల్టర్ ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. గ్రామంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఫిల్టర్ ఇసుకను ఇటీవల తహసీల్దార్‌తో పాటుగా పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌నాయుడు పరిశీలించి, ఫిల్టర్ ఇసుకను ఇళ్ల నిర్మాణానికి వాడరాదని సూచించారు. అయినా వారు అదే ఇసుకతో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ సూచనల మేరకు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్ఐ తిరుపతయ్య గ్రామానికి వెళ్లి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల దగ్గర నిల్వ చేసిన ఫిల్టర్ ఇసుకను పరిశీలించారు. గతంలో చూసిన దానికంటే ఇసుక తక్కువగా ఉండటంతో పాటుగా కుప్పలుగా ఉన్న ఇసుకను చదునుగా చేసి ఉండటంతో 13 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.